# పాఠశాల విద్య, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

## సంచాలకుల ఉత్తర్వులు

ఉత్తర్వు సంఖ్య: **405/C&T/D/TSCERT/2015** తేది: 27.07.2015

విషయం : తెలంగాణ రాష్ట్రం, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, హైదరాబాదు – విద్యా సంస్కరణలు – విద్యా సంవత్సరం 2015-16 కోసం అకడమిక్ క్యాలెండర్ గురించి, ఇతర కార్యక్రమాలను అమలుపరచడం గురించి మార్గదర్శకాలు.

సందర్భం : 1. ప్రభుత్వ మెమో సంఖ్య 1840/ప్రోగ్రామ్.II/ఎ2/21015, తేది 09.06.2015.
2. సంచాలకులు, పాఠశాల విద్య గారి ఉత్తర్వులు Rc. No. 405/D/C&T/SCERT/2015, Dated: 12.06.2015 and Dated: 22.06.2015
3. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 60, తేది 26.10.2013.
4. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 17, తేది 14.05.2014
5. ఆర్.టి.ఇ.-2009 చట్టం.

× × ×

పై విషయం పురస్కరించుకొని జిల్లా విద్యాధికారులకు, పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులకు తెలియజేయునది ఏమనగా.. తెలంగాణ రాష్ట్రంలో గత సంవత్సరం నుండి పాఠశాల విద్యలో సంస్కరణలు చేపట్టారు. 2015 మార్చి మాసంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా నూతన విధానంలో నిర్వహించుకున్నాం. 2015-16 విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలలు అనగా.. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో విద్యా సంస్కరణలను మరింత ప్రభావవంతంగా అమలుపరచడానికి మార్గదర్శకాలను రూపొందించారు. వీటిని ఆయా పాఠశాలల్లో విధిగా అమలుజరిపేలా జిల్లా విద్యాధికారులు, పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు తగిన చర్యలు చేపట్టగలరని కోరనైనది. సందర్భం 2 ప్రకారం పాఠశాల కాలనిర్ణయపట్టికతో పాటు ఇతర అంశాలపై ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. వీటికి సంబంధించిన మరిన్ని వివరాలను కింద ఇవ్వడం జరిగింది.

**1. 2015-16 విద్యా సంవత్సరం కోసం రూపొందించిన అకడమిక్ క్యాలెండర్‌ను అమలుపరచడం**

- విషయనిపుణులు, ఉపాధ్యాయ సంఘాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి. ప్రతినిధులు 2015-16 విద్యా సంవత్సరం కోసం అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందించారు. దీంట్లో పాఠశాల పనివేళలు, కాలనిర్ణపట్టిక, మాసవారీగా సిలబస్ వివరాలు, చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలను పొందుపరిచారు. వీటిని చెక్‌లిస్ట్ రూపంలో చేర్చారు. ప్రతి మాసంలో ప్రధానోపాధ్యాయుడు అకడమిక్ క్యాలెండర్‌లో పొందుపరిచిన కార్యక్రమాలను అమలుపరిచి మాసాంతంలో చెక్‌లిస్ట్‌ను పూరించాల్సి ఉంటుంది.
- పాఠశాలలకు వెళ్ళిన మానిటరింగ్ అధికారులు తప్పనిసరిగా మాసవారీగా అకడమిక్ క్యాలెండర్‌లోని కార్యక్రమాలను అమలుపరచడం గురించి సమీక్షించి సలహాలు, సూచనలు ఇవ్వాలి.

**2. సి.సి.ఇ. అమలుపరచడం**

- గత విద్యా సంవత్సరం 1 నుండి 8 వరకు సి.సి.ఇ. (నిరంతర సమగ్ర మూల్యాంకనం) మరియు 9, 10 తరగతులకు పరీక్షల సంస్కరణలను అమలుపరిచారు. ఈ విద్యా సంవత్సరం నుండి అనగా.. 2015-16లో 6 నుండి 10వ తరగతి వరకు సి.సి.ఇ. విధి విధానాలను ఒకే రీతిలో అమలుపరచాలి. అనగా.. 9, 10 తరగతులకు నిర్వహించిన విధంగానే 20 మార్కులకు నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని (ఎఫ్.ఎ.), 80 మార్కులకు సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని (ఎస్.ఎ.) నిర్వహించాలి.

- ఆయా సబ్జక్టులలో తెలిపిన విధంగా ఎఫ్.ఎ. కు నాలుగు (4) సాధనాలు ఉంటాయి. ఒక్కొక్క దానికి 5 మార్కులు ఉంటాయి. వీటిని విద్యా సంవత్సరంలో నాలుగు సార్లు నిర్వహించాలి. మొదటిది జులై, రెండవది ఆగస్టు, మూడవది నవంబర్, నాల్గవది జనవరి/ ఫిబ్రవరి మాసాల్లో నిర్వహించాలి.
- ఈ విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ మెమో ప్రకారం రెండు సంగ్రహణాత్మక మూల్యాంకనాలను 80 మార్కులకు నిర్వహించాలి. మొదటిది అక్టోబర్ మాసంలో, రెండవది మార్చి మాసంలో నిర్వహించాలి.
- మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనానికి ముందు రెండు ఎఫ్.ఎ.లు ఉంటాయి. 20 మార్కుల కోసం రెండు ఎఫ్.ఎ.ల సగటును తీసుకోవాలి. ఈ 20 మార్కులను మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనానికి చెందిన 80 మార్కులకు కలిపి నమోదు చేయాలి.
- రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం విద్యా సంవత్సరం చివరలో అనగా.. మార్చి మాసంలో ఉంటుంది. ఇది 80 మార్కులకు ఉంటుంది కాబట్టి మిగతా 20 మార్కుల కోసం అన్ని ఎఫ్.ఎ.ల సగటు తీసుకొని నమోదు చేయాలి.
- **1 నుండి 5 తరగతులకు** నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని 50 మార్కులకు, సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహించాలి. ఈ తరగతులకు గత సంవత్సరం నిర్వహించిన విధానమే కొనసాగుతుంది.

**3. నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ**

- నిర్మాణాత్మక మూల్యాంకనానికి నాలుగు (4) సాధనాలు ఉన్నాయి. అవి: 1. పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందనలు, 2. రాతపనులు, 3. ప్రాజెక్టుపనులు 4. లఘు పరీక్ష.
- 6 నుండి 10వ తరగతి వరకు **పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందనల**ను ఆయా సబ్జక్టుల వారీగా నిర్వహిస్తాము. భాషా సబ్జక్టులలో.. గ్రంథాలయ పుస్తక పఠనం, దానికి గురించి నివేదిక రాయడం ఉంటుంది. ఇందుకోసం ఒక ఫార్మేటివ్ సమయంలో ఒక అంశానికి నివేదిక రాస్తే సరిపోతుంది. అయితే పిల్లలు ఎన్ని పుస్తకాలైనా చదువవచ్చు. వాటిలో నుండి ఒక దానికి సమీక్ష రాసి నివేదిక సమర్పిస్తే సరిపోతుంది. ఇలా ఒక విద్యా సంవత్సరంలో ఒక్కొక్క ఎఫ్.ఎ.కు ఒకటి చొప్పున నాలుగు (4) సమీక్షలు రాయాల్సి ఉంటుంది. అట్లాగే సైన్స్‌లో ప్రయోగ రికార్డును రాయాల్సి ఉంటుంది. ఒక ఫార్మేటివ్‌కు ఒకటి చొప్పున నాలుగు (4) రాయాలి. సాంఘికశాస్త్రంలో కూడా సమకాలీన అంశాలకు చెందిన నివేదికలను ఒక్కొక్క ఫార్మేటివ్ ఒకటి చొప్పున నాలుగు (4) రాయాలి. గణితంలో పూర్తయిన అధ్యాయాల ఆధారంగా నూతన సమస్యలను రాయాలి. అయితే ఆయా ఫార్మేటివ్ కాలంలో పూర్తయిన అధ్యాయాలకు మార్కులను కేటాయించి సగటు మార్కులను నమోదు చేయాలి.
- **రాతపనులలో** భాగంగా పాఠ్యపుస్తకంలోని పాఠాలలో ఇచ్చిన అభ్యాసాలను/ ప్రశ్నలకు పిల్లలు సొంతంగా జవాబులు రాయలి. గైళ్ళు, స్టడీ మెటీరియళ్ళు మొదలగు వాటిని చూసి రాయకూడదు. ఒక ఫార్మేటివ్ కాలంలో పూర్తయిన పాఠాల ఆధారంగా ప్రతి పాఠానికి సొంతంగా జవాబులు రాయాలి. ప్రతి పాఠానికి మార్కులు కేటాయించి సగటును నమోదు చేయాలి.
- **ప్రాజెక్టుపనులను** కూడా ఒక ఫార్మేటివ్‌కు ఒకటి చొప్పున విద్యా సంవత్సరంలో నాలుగు (4) ప్రాజెక్టుపనులను చేసి నివేదిక రాసి సమర్పించాలి. వీలైనంత మేరకు స్థానికంగా విషయ సేకరణకు అనుగుణంగా ఉండే ప్రాజెక్టుపనులను ఇవ్వాలి. పాఠ్యపుస్తకాల్లో ఇచ్చిన ప్రాజెక్టుపనులు ఒకవేళ ఇందుకనుగుణంగా లేకుంటే వాటిని మార్చి ఇవ్వవచ్చు. ఇంటర్నెట్ ఆధారంగా విషయాన్ని సేకరించే ప్రాజెక్టుపనుల స్థానంలో వేరే వాటిని కూడా ఇవ్వవచ్చు.
- **లఘు పరీక్ష**ను ఒక ఫార్మేటివ్ కాలంలో కనీసం ఒకటి నిర్వహించాలి. ఒకవేళ సమయం అందుబాటులో ఉండి ఒకటి కంటే ఎక్కువ నిర్వహిస్తే.. ఎక్కువ మార్కులు వచ్చిన దాన్ని పరిగణనలోకి తీసుకొని నమోదు చేయాలి. లఘు పరీక్షకు ఎట్టి పరిస్థితుల్లో పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలను యథాతథంగా ఇవ్వకూడదు. ఆలోచించే ప్రశ్నలు ఇవ్వాలి. దీని వల్ల పిల్లలకు పబ్లిక్ పరీక్షకు కావల్సిన అభ్యాసం లభిస్తుంది.

**4. గైళ్ళు, స్టడీ మెటీరియళ్ళ వాడకాన్ని నిరోధించడం**

- ప్రభుత్వ ఉత్వర్వు సంఖ్య 17, తేది 14.05.2014 ప్రకారం.. గైళ్ళు, స్టడీ మెటీరియళ్ళ వాడకాన్ని నిషేధించారు. కాబట్టి ప్రైవేట్, ప్రభుత్వ అన్ని యాజమాన్యాల్లో వీటిని వాడకూడదు. పిల్లలు సొంతంగా ఆలోచించి రాసేలా అభ్యాసం కల్పించాలి. అయితే కొన్ని పాఠశాలల్లో ఒక తరగతిలోని పిల్లలు వివిధ రకాల గైళ్ళను వాడడం ద్వారా పిల్లల జవాబులు విభిన్నంగా ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. వాస్తవానికి పాఠ్యపుస్తకాలు, పరీక్షల సంస్కరణలు అన్నీ కూడా పిల్లల్లో ఆలోచనాశక్తిని, సృజనాత్మకతను, కల్పనాశక్తిని, సమస్యా పరిష్కారశక్తిని, స్వీయ అభివ్యక్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉద్దేశించినవి. వీటిని సాధించేలా చూడడం పాఠశాలల యొక్క నైతిక బాధ్యత. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో గైళ్ళు, స్టడీ మెటీరియళ్ళ వాడకాన్ని నిరోధించాలి.
- వీటిని పరిశీలించడానికి జిల్లా, రాష్ట్ర స్థాయి బృందాలు పాఠశాలలను సందర్శిస్తారు. ఒకవేళ వీటిని వినియోగిస్తున్నట్లు తెలిసినచో ఆయా ప్రధానోపాధ్యాయులపైన, ఉపాధ్యాయులపైన చర్యలు తీసుకుంటారు. ప్రైవేట్ యాజమాన్యాలపైన చర్యలు తీసుకుంటారు.

**5. క్యుములేటివ్ రికార్డు**

- సి.సి.ఇ.లో భాగంగా ప్రతి విద్యార్థికి క్యుములేటివ్ రికార్డును నిర్వహించాలి. ఇందుకోసం సర్వ శిక్షా అభియాన్ పథక సంచాలకులు విద్యార్థులకు అవసరమైన క్యుములేటివ్ రికార్డులను ముద్రించి ఇవ్వడానికి అవసరమైన మార్గదర్శకాలను ఇప్పటికే జారీ చేశారు. కాబట్టి ఆయా జిల్లా విద్యాధికారులు జిల్లా ప్రాజెక్టు అధికారులతో చర్చించి ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు క్యుములేటివ్ రికార్డులను ముద్రింపజేసి అందించడానికి అవసరమైన చర్యలను చేపట్టాలి.
- ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు కూడా ఎస్.సి.ఇ.ఆర్.టి. రూపొందించిన క్యుములేటివ్ రికార్డులను ముద్రించి పిల్లలకు అందజేయాల్సి ఉంటుంది. దీని నమూనా ఎస్.సి.ఇ.ఆర్.టి. వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

**6. సహపాఠ్య కార్యక్రమాల అమలు**

- ఆర్.టి.ఇ.-2009 ప్రకారం పిల్లలు సర్వతోముఖాభివృద్ధిని సాధించాలి. ఇందుకోసం పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో (ప్రభుత్వ, ప్రైవేట్) నిర్వహించాల్సి ఉంటుంది. 2015-16 విద్యా సంవత్సరం కోసం రూపొందించిన అకడమిక్ క్యాలెండర్‌లో వీటికి పీరియళ్ళను కేటాయించారు. ఆయా పీరియళ్ళలో తప్పనిసరిగా సహపాఠ్య కార్యక్రమాలకు చెందిన బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించబడాలి.
- సహపాఠ్య కార్యక్రమాల అమలు కోసం ప్రధానోపాధ్యాయులు పాఠశాలలోని ఉపాధ్యాయులకు బాధ్యతలను అప్పగించాలి. ఇందుకోసం రూపొందించిన సిలబస్ పుస్తకాలను వాటిని బోధించే ఉపాధ్యాయులకు ఇచ్చి వాటి ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించేలా చూడాలి. ఒకవేళ పాఠశాలలకు ఈ సిలబస్ పుస్తకాలు అందకుంటే సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారిని సంప్రదించాలి.
- గత సంవత్సరం అక్టోబర్ మాసంలో నిర్వహించిన ఉపాధ్యాయ శిక్షణల సందర్భంగా ఉపాధ్యాయ కరదీపికలతో పాటు సహపాఠ్య కార్యక్రమాల సిలబస్ పుస్తకాలను ముద్రించి పాఠశాలలకు అందించాల్సిందిగా జిల్లా విద్యాధికారులను పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఆదేశించడం జరిగింది. అయితే ఇప్పటికీ కూడా కొన్ని పాఠశాలలకు ఇవి చేరలేదు. ఈ పుస్తకాలు కార్యాలయాల్లోనే ఉన్నట్లుగా తెలుస్తున్నది. కాబట్టి ఆయా జిల్లా విద్యాధికారులు సహపాఠ్య కార్యక్రమాలకు చెందిన సిలబస్ పుస్తకాలు తప్పనిసరిగా అన్ని పాఠశాలలకు చేరేలా చర్యలు తీసుకోవాలి. వీటి గురించి రాష్ట్ర స్థాయి బృందాలు ఆయా జిల్లాల్లో పర్యటించి కమీషనర్‌కు నివేదికలు సమర్పిస్తారు.
- సహపాఠ్య కార్యక్రమాలకు ఎఫ్.ఎ. ఉండదు. కేవలం సంగ్రహణాత్మక మూల్యాంకనమే ఉంటుంది. వీటి వివరాలను కూడా క్యుములేటివ్ రికార్డుల్లో నమోదు చేయాలి.

**7. పాఠశాల గ్రంథాలయం, ప్రయోగశాలల నిర్వహణ**

- ప్రస్తుతం అమలుపరుస్తున్న నూతన పాఠ్యపుస్తకాలను బోధించడానికి, సి.సి.ఇ. ని అమలుపరచడానికి పాఠశాల గ్రంథాలయం, ప్రయోగశాలల నిర్వహణ తప్పనిసరి. వీటిని తగిన పుస్తకాలు, సామగ్రితో బలోపేతం చేయాలి. వీటిని పిల్లలకు అందుబాటులో ఉంచాలి. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఇవి నామమాత్రంగానే ఉన్నాయి. ఇవి లేకుండానే పుస్తక సమీక్ష నివేదికలు రాయడం, ప్రయోగ రికార్డులను రాయడం వంటివి చేస్తున్నారు. మానిటరింగ్ బృందాలు పాఠశాలలను సందర్శించినపుడు లోపాలను గమనిస్తే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటారు. కాబట్టి పాఠశాలలకు అవసరమైన గ్రంథాలయ పుస్తకాలను, ప్రయోగశాలకు చెందిన సామగ్రిని సమకూర్చుకోవాలి.
- ఉపాధ్యాయ శిక్షణల సందర్భంగా ముద్రించి సరఫరా చేసిన ఉపాధ్యాయ కరదీపికలను ప్రధానోపాధ్యాయులు విధిగా పాఠశాల గ్రంథాలయంలో ఉంచి సంబంధిత స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలి.

**8. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు**

- 2015-16 విద్యా సంవత్సరంలో నాలుగు (4) స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆగస్టు, సెప్టెంబర్, నవంబర్, జనవరి మాసాల్లో నిర్వహిస్తారు. ఆయా సబ్జక్టు ఉపాధ్యాయులు విధిగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కావాలి. అకడమిక్ క్యాలెండర్‌లో ఈ వివరాలను పొందుపరిచారు. కాబట్టి ఆయా ప్రధానోపాధ్యాయులు ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యేలా చూడాలి.
- నూతన పాఠ్యపుస్తకాలు, పరీక్షల సంస్కరణలు అమలు జరుగుతున్నందున స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉపాధ్యాయులకు అవసరమైన వృత్తి నైపుణ్యాలను అందించడానికి తోడ్పడుతాయి. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో మాదిరి పాఠ్య బోధన, పాఠ్య ప్రణాళికలు రాయడం, ప్రశ్నాపత్రాలు రూపొందించడం, జవాబుపత్రాలను దిద్దడంపై అవగాహన, విశ్లేషణ మొదలగు కార్యక్రమాలు ఉంటాయి. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించబడే పాఠశాలల్లో ఆ ప్రధానోపాధ్యాయులు ఇందుకనుగుణంగా సంబంధిత విషయనిపుణులతో చర్చించి ఎజెండాను రూపొందించుకొని సక్రమంగా నిర్వహించేలా చూడాలి.

**9. పాఠ్యపుస్తకాల వినియోగం, బోధనాభ్యసన ప్రక్రియల్లో మార్పు**

- 2011 నుండి రాష్ట్రంలో నూతన పాఠ్యపుస్తకాలు అమల్లోకి వచ్చాయి. ఈ విద్యా సంవత్సరం నుండి తెలుగు నూతన పాఠ్యపుస్తకాలు అమల్లోకి వచ్చాయి. అట్లాగే సాంఘికశాస్త్రంలో నూతన అధ్యాయాలను చేర్చారు. వీటి గురించి ఇప్పటికే ప్రతి సంవత్సరం శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఇందుకనుగుణంగానే సి.సి.ఇ./ పరీక్షల సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. అయితే దురదృష్టవశాత్తు ఇప్పటికీ కూడా ఈ నూతన పాఠ్యపుస్తకాలను ఆశించిన విధంగా పూర్తి స్థాయిలో ఉపయోగించడం లేదు. కాబట్టి ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకాల్లోని ఉపాధ్యాయులకు సూచనలను, సాధించాల్సిన సామర్థ్యాలను చదివి అర్థం చేసుకొని మార్గదర్శకాల ప్రకారం పాఠ్యపుస్తకాలను వినియోగించాలి.
- బోధనాభ్యసన ప్రక్రియలను కూడా పిల్లల్ని ఆలోచింపజేసేలా నిర్వహించాలి. ఆయా సబ్జక్టులకు చెందిన సోపానాల ప్రకారం నిర్వహించాలి. ఇందుకోసం వార్షిక ప్రణాళికను, పాఠ్య ప్రణాళికలను రాసుకొని దాని ప్రకారం బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించాలి. బోధించడం అంటే కేవలం వివరించడం మాత్రమే కాదు. ఆ తర్వాత పిల్లల్ని ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా వ్యక్తీకరించే అవకాశం కల్పించాలి. ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలు కూడా ఉన్నాయి. పాఠంలోని విషయ వివరణకు 60% పీరియళ్ళు ఉపయోగిస్తే.. మిగతా పీరియళ్ళను పాఠశాలల్లోనే పిల్లలతో అభ్యాసాలను చేయించడానికి ఉపయోగించాలి.

**10. మానిటరింగ్ కార్యక్రమం**

- ఈ విద్యా సంవత్సరం నుండి మానిటరింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి పెడతారు. ఇందుకోసం మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వీరు అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలను సందర్శిస్తారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల వినియోగం, బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ, సి.సి.ఇ. అమలు, ఫార్మేటివ్ నిర్వహణ, సహపాఠ్య కార్యక్రమాల బోధన, వనరుల వినియోగం మొదలగు వాటిని పరిశీలిస్తారు. వీటి ఆధారంగా నివేదికలు రూపొందించి పాఠశాల విద్యాశాఖ సంచాలకులకు సమర్పిస్తారు. వీటి ఆధారంగా సంచాలకులు చర్యలు తీసుకుంటారు.

- ఉన్నత పాఠశాలల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడే మొదటి మానిటరింగ్ అధికారి. కాబట్టి ఆయన/ ఆమె పాఠశాలలో పనిచేసే ప్రతి యొక్క ఉఉపాధ్యాయుడి పనితీరును తరగతిగదికి వెళ్ళి ఒక మాసంలో ఒకసారి పరిశీలించాల్సి ఉంటుంది. ఇందుకోసం 'పరిశీలన పత్రం' కూడా ప్రధానోపాధ్యాయుల కరదీపికలో పొందుపరిచారు. దీని ఆధారంగా తరగతిగది పరిశీలన చేయాలి. ప్రతి మాసంలో ఉపాధ్యాయులతో నిర్వహించే సమీక్ష సమావేశంలో తరగతి పరిశీలనల ఆధారంగా సలహాలు, సూచనలు ఇచ్చి లక్ష్యాలను నిర్ధారించాలి.

- అన్ని పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు రాసిన తరవాతనే బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. ఆయా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులందరూ పాఠ్య ప్రణాళికలు రాసి బోధించేలా చూడాలి.

పైన తెలిపిన అంశాలను అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో అమలుపరిచేలా సంబంధిత జిల్లా విద్యాధికారులు, పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు చర్యలు చేపట్టి బాధ్యత వహించాలి. ఈ వివరాలను ప్రసారమాధ్యమాల ద్వారా అన్ని పాఠశాలలకు తెలిసేలా చూడాలి. అట్లాగే జిల్లా వెబ్‌సైట్‌లో కూడా ఉంచాలి. తప్పనిసరిగా ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలలకు ప్రభుత్వ ఉత్వర్వులు 60, 17, 2, 3, అకడమిక్ క్యాలెండర్, ప్రభుత్వ మెమో 1840 తేది 09.06.2015, క్యుములేటివ్ రికార్డుల నమూనా అందేలా చర్యలు చేపట్టాలి. వీటి ఆధారంగా ఈ విద్యా సంవత్సరంలో పిల్లలందరికి నాణ్యమైన విద్య లభించేలా చూడాలి. ఈ ఉత్తర్వులు తెలంగాణ, ఎస్.సి.ఇ.ఆర్.టి. వెబ్‌సైట్ www.scert.telangana.gov.in లో కూడా అందుబాటులో ఉంటాయి. జిల్లా విద్యాధికారులు ఈ ఉత్తర్వులను మరియు అనుబంధంలో తెలిపిన జి.ఓ.లను ప్రతి పాఠశాలకు అనగా ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలకు పంపించి, ఇవి అమలయ్యేవిధంగా చూడాలి. అన్ని పాఠశాలల్లో అనగా ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో సి.సి.ఇ., అకడమిక్ క్యాలెండర్, నూతన పాఠ్యపుస్తకాల అమలుకు జిల్లా విద్యాధికారులు బాధ్యత వహించాలి. వీటి సరైన అమలుపై మానిటరింగ్ చేయాలి.

**అనుబంధం:**
1. ప్రభుత్వ మెమో సంఖ్య 1840/ప్రోగ్రామ్.II/ఎ2/21015, తేది 09.06.2015
2. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 60, తేది 26.10.2013
3. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 17, తేది 14.05.2014

సంచాలకులు
పాఠశాల విద్య, తెలంగాణ రాష్ట్రం

<u>దీని ప్రతులు</u>
జిల్లా విద్యాధికాధిరులు, తెలంగాణ రాష్ట్రం;
పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, తెలంగాణ రాష్ట్రం
గారలకు తగు చర్యల నిమిత్తం